

మ్యానిఫెస్టో కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

## గ్రామగ్రామాన బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

చిన్నగూడూరు, నవంబర్ 7: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన రెడ్యానాయక్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ మాట్లాడుతూ రెడ్యానాయక్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మన్నె చెన్నయ్య, శ్రీరాములు, ఉపేందర్, రామచంద్రు పాల్గొన్నారు.



ఏకగ్రీవ తీర్మాన కాపీతో రెడ్యానాయక్‌ను కలిసిన విస్సంపల్లి గ్రామస్తులు

## రెడ్యానాయక్‌కు దళితుల మద్దతు

చిన్నగూడూరు, నవంబర్ 7: మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన దళితులు ఎన్నికల్లో రెడ్యానాయక్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి తమ గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన రెడ్యాను మళ్లీ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతిన బూనారు. అనంతరం ఉగ్గంపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి తీర్మాన కాపీని రెడ్యానాయక్‌కు అందజేశారు. నామినేషన్ ఫీజును తామే చెల్లించి ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మంగపతిరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శాగంటి శ్రీను, నాయకులు వెంకటేశ్వరరావు, హుస్సేన్, ఉపేందర్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి రెడ్యానాయక్‌ను ఆదరించాలి

సీఎం కేసీఆర్ సహకారంతోనే నియోజకవర్గ ప్రగతి

- ప్రతి వీధిలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- నిత్యం అందుబాటులో ఉండే రెడ్యాను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఇంటింటా ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

దంతాలపల్లి, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని రైతుబంధు సమితి జిల్లా కార్యదర్శి నాయిని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పార్టీ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గెలుపు కోరుతూ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు వీరబోయిన కిశోర్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు గిర్వాణి, ఉపాధ్యక్షుడు అంకం సోమేశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షుడు రొయ్యల సురేశ్, నాయకులు రవీందర్, అర్జున్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### రెడ్యా విజయం కోసం కృషి చేయాలి

డోర్నకల్ నియోజకవర్గ అభ్యర్థి రెడ్యానాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని జడ్పీ వైస్‌చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాల్యా తండాలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కారు గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వొలాద్రి మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రవి, నాయకులు

### బీఆర్ఎస్‌తోనే మత్స్యకారుల అభ్యున్నతి

మరిపెడ: సీఎం కేసీఆర్ ప్రభుత్వంలోనే మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కలుగుతున్నదని తెలంగాణ మత్స్యకార సంఘం జిల్లా నాయకుడు పిట్టల ధనుంజయ అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రతి ఇంటికీ పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. డోర్నకల్ నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న రెడ్యానాయక్‌కు 25వేల మంది మత్స్యకారులు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలు, రాయితీపై మార్కెటింగ్ వాహనాలు అందించి వారి ఉపాధికి ఊతం కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, హబీబుద్దీన్ పాల్గొన్నారు.

### రైతు సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటు వేసి అండగా నిలవాలని కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంపెల్లి రవి అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూరంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీలకతీతంగా పని చేస్తున్న రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ము నరేశ్, కొమ్మ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మరిపెడ: మ్యానిఫెస్టో పత్రాలతో ప్రచారం చేస్తున్న ధనుంజయ, నాయకులు



దంతాలపల్లి: హోటల్‌లో బజ్జీలు వేస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మద్యం బాటిళ్లు సీజ్

డోర్నకల్, నవంబర్ 7: మండలంలోని బూర్గుపాడు గ్రామంలో ఓ బెల్టు షాపులో మద్యం బాటిళ్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాయబారపు రేణుక బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4వేలు ఉంటుందని, రేణుకపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### 10 లీటర్ల గుడుంగా స్వాధీనం

మండలంలోని ఫకీరా తండా గ్రామ పంచాయతీ పరిధి బోడ్యా తండాలో మంగళవారం పోలీసులు దాడి చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాలు ప్రకారం.. బోడ్యా తండాలో భూక్యా సాల్కు గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశారు. 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. సాల్కుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తూర్పుతండాలో ఎక్సైజ్ దాడులు

దంతాలపల్లి, నవంబర్ 7: మండల పరిధి తూర్పుతండాలో గుడుంబా స్థావరాలపై పోలీసుల ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్‌బాబు మాట్లాడుతూ.. తండాకు చెందిన బుజ్జి ఇంట్లో అక్రమంగా ఉన్న 20 లీటర్ల గుడుంబా, 50 కిలోల బెల్లం, 2 కిలోల పట్టికను సీజ్ చేసి, అనంతరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ డేవిడ్
- కురవిలో అన్ని శాఖల అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ
- నిర్భయంగా ఓటు వేయాలని సూచన

కురవి, నవంబర్ 7: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా విలువైనదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితోపాటు అన్నిశాఖల అధికారులు కలిసి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురవి గ్రామ పంచాయతీ నుంచి 365 జాతీయ రహదారి మీదుగా గుడి సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటు నమోదు నిరంతర ప్రక్రియ అని, విధిగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీతో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో హరిప్రసాద్, సీఐ రమేశ్‌నాయక్, సీడీపీవో ఎల్లమ్మ, ఎంపీడీవో సరస్వతీ, తహసీల్దార్లు సునీల్, నరేశ్, ఎస్సై గోపి, ఈజీఎస్ ఏపీవో ఏకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.




గుడి సెంటర్‌లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ డేవిడ్

## బీఆర్ఎస్ గెలుపు కోసం సైనికుల్లా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

నర్సింహులపేట, నవంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముందుండి పోరాడిన యువత బీఆర్ఎస్ గెలుపు కోసం సైనికులుగా పనిచేయాలని సోషల్ మీడియా ప్రతినిధి బింగి విక్రమ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కోరారు. అనిల్, చంద్రశేఖర్, వీరన్న, రాంబాబు, పృథ్వీ, యాకన్న, రవి, సురేశ్, జయపాల్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

## రైలుకింద పడి ఒకరి ఆత్మహత్య

డోర్నకల్, నవంబర్ 7: గూడ్స్ రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్- గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ మధ్య మంగళవారం జరిగింది. జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్- గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ మధ్య కిలోమీటర్ నంబర్ 437/8-10 వద్ద ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలుకింద పడి 55-60 వయస్సు గల వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఫుల్ హ్యాండ్స్ నిలువు గీతల తెల్ల చొక్క ధరించాడు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సహాయంతో ఖమ్మం ఏరియా దవాఖాన మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.